పాఠశాలలో సైన్స్‌ ల్యాబ్‌ ప్రారంభం



సనత్‌నగర్‌: హెచ్‌సీఎల్‌ సౌజన్యంతో నిర్మాణ్‌ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అశోక్‌కాలనీలోని సనత్‌నగర్‌ ఓల్డ్‌ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్‌ల్యాబ్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా సంస్థల ప్రతినిధులు హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. సైన్స్‌ ల్యాబ్‌లు విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని మరింతగా పెంపొందింపజేస్తాయన్నారు. నూతన ఆవిష్కరణలకు సైన్స్‌ ల్యాబ్‌లు దారితీస్తాయన్నారు. కార్యక్రమంలో మేడ్చెల్‌ జిల్లా అకడమిక్‌ మానిటరింగ్‌ ఆఫీసర్‌ రవీందర్‌ రాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మార్తి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పేరిట డబ్బులు డిమాండ్‌ చేస్తే చర్యలు

సనత్‌నగర్‌: ఇందిరమ్మ ఇళ్ల సర్వే పేరిట ఎవ



సర్వే తీరును పరిశీలిస్తున్న బేగంపేట సర్కిల్‌ ఉప కమిషనర్‌ సమ్మయ్య

రైనా డబ్బులు డిమాండ్‌ చేస్తే తన దృష్టికి తీసుకురావాలని జీహెచ్‌ఎంసీ బేగంపేట సర్కిల్‌ ఉప కమిషనర్‌ సమ్మయ్య సూచించారు. బేగంపేట సర్కిల్‌లో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను బుధవారం ఆయన పరిశీలించారు. దరఖాస్తుదారుల పూర్తి వివరాలు నమోదు చేస్తున్నారా? లేదా చెక్‌ చేశారు. దరఖాస్తుదారుని పూర్తి వివరాలతో పాటు వారి ఫోటోలను యాప్‌లో అప్‌లోడ్‌ చేసే విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. పక్కా సమాచారంతో పాటు సర్వేలో ఖచ్చితత్వం ఉండాలని సిబ్బందికి సూచించారు.

గాంధీలో పీడియాట్రిక్‌ పెడికాన్‌ వర్క్‌షాప్‌



వర్క్‌షాప్‌లో పాల్గొన్న గాంధీ పాలనాధికారులు, వైద్యులు

గాంధీఆస్పత్రి : ఇండియన్‌ అకాడమి ఆఫ్‌ పీడియాట్రిక్‌ 62వ జాతీయ సదస్సును పురస్కరించుకుని సికింద్రాబాద్‌ గాంధీఆస్పత్రిలో పీడియాట్రిక్‌ పెడికాన్‌ వర్క్‌షాప్‌ను బుధవారం నిర్వహించారు. గాంధీ మెడికల్‌ కాలేజీ ప్రిన్సిపాల్‌ ప్రొఫెసర్‌ ఇందిర, సూపరింటెండెంట్‌ ప్రొఫెసర్‌ రాజకుమారీ ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. చిన్నారులకు వైద్యసేవలు అందించడంతో నర్సింగ్‌ సిబ్బంది పాత్ర కీలకమన్నారు. పీడియాట్రిక్‌ విభాగంలో నర్సింగ్‌ సిబ్బంది కోసం వర్క్‌షాప్‌ నిర్వహించడం తెలంగాణలో ఇదే ప్రథమమన్నారు. కార్యక్రమంలో గాంధీ పీడియాట్రిక్‌ హెచ్‌ఓడీ వాసుదేవ్‌, ప్రొఫెసర్‌ జీఎస్‌జార్జ్‌, అజయ్‌మోహన్‌, డాక్టర్‌ వెంకటేశ్వర్లు, స్నేహ, ఆర్‌ఎంఓ–1 శేషాద్రిలు పాల్గొన్నారు.

వైభవంగా కొనసాగుతున్న ధనుర్మాస మహోత్సవాలు..

సనత్‌నగర్‌: హనుమాన్‌ దేవాలయ ప్రాంగణంలోని శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. స్వామి వారికి విశేష అలంకరణతో పాటు తిరుప్పావై పాశురాల పారాయణం, విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈఓ సత్యనారాయణ పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు పరాశరం రవీంద్రాచార్యుల ఆధ్వర్యంలో ప్రతిరోజూ పూజా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

వర్సిటీల అధ్యాపకుల ఉద్యోగ విరమణ వయసు పెంచొద్దు

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని వివిధ వర్సిటీలలో పని చేస్తున్న అధ్యాపకుల వయోపరిమితిని పెంచొద్దని ఓయూ జేఏసీ నాయకులు వేల్పుల సంజయ్‌ డిమాండ్‌ చేశారు. బుధవారం అధ్యాపకుల పదవీ విరమణ వయస్సు 65 సంవత్సరాలు పెంచాలనే ప్రతిపాదనను విరమించుకోవాలని ర్యాలీ చేపట్టారు. వేలాది మంది నిరుద్యోగులు వర్సిటీల భర్తీల కోసం ఎదురు చూస్తున్నారని తక్షణం ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్‌ విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో నారాయణ, అందె కృష్ణ, అనిల్‌, రమేష్‌, భాస్కర్‌, సైదులు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వార్డు కార్యాలయాల వ్యవస్థ ఏదీ..



సనత్‌నగర్‌ నెహ్రూ పార్కు వార్డు కార్యాలయంలో ఖాళీగా అధికారుల క్యాబిన్లు

- నీరుగారుతున్న లక్ష్యం..
- క్షేత్రస్థాయి పర్యటనలంటూ అందుబాటులో ఉండని అధికారులు..

సనత్‌నగర్‌: పాలనా వ్యవస్థను ప్రజలకు మరింత దగ్గర చేయాలనే సంకల్పంతో గత ప్రభుత్వం వార్డు కార్యాలయాల వ్యవస్థను ప్రవేశపెట్టింది. జీహెచ్‌ఎంసీలో డివిజన్‌కు ఓ కార్యాలయాన్ని ఏర్పాటుచేసి వివిధ విభాగాల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టింది. అయితే పేరుకు వార్డు కార్యాలయాలు.. అక్కడ ఎవరూ అందుబాటులో ఉండడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. క్షేత్ర స్థాయిలో పర్యటనల సాకుతో వార్డు కార్యాలయాల వైపు అధికారులు కన్నెత్తి కూడా చూడడం లేదు. ఫలితంగా సమస్యను విన్నవించుకునేందుకు వచ్చే ప్రజలకు వార్డు కార్యాలయానికి తాళం వేసి ఉండడమో లేక ఒకవేళ తెరుచుకున్నా ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయని వాపోతున్నారు. సనత్‌నగర్‌ డివిజన్‌కు సంబంధించి స్థానిక నెహ్రూ పార్కులో ఉన్న కమ్యూనిటీ హాల్‌ను వార్డు కార్యాలయంగా మార్చారు. అమీర్‌పేట డివిజన్‌కు సంబంధించి బీకేగూడలోని పురాతన వార్డు కార్యాలయం, బేగంపేట డివిజన్‌కు సంబంధించి పాటిగడ్డ మోడల్‌ మార్కెట్‌లోని ఓ షట్టర్‌ను వార్డు కార్యాలయంగా అందుబాటులోకి తీసుకువచ్చారు. బీకేగూడ వార్డు కార్యాలయానికి అడపా దడపా అధికారులు వచ్చిపోతుంటారు. కానీ సనత్‌నగర్‌, బేగంపేట డివిజన్ల వార్డు కార్యాలయాలను ఎప్పుడు తెరుస్తారో, ఎప్పుడు మూసివేస్తారో అధికారులకే ఎరుక. ఒకవేళ తెరిచి ఉందని కార్యాలయం లోపలికి వెళితే అధికారులు కానరారు. ఏదైనా సమస్యపై అర్జీ పెట్టుకుందామంటే వారు ఎప్పుడు వస్తారో కూడా తెలియని పరిస్థితి.



బేగంపేట పాటిగడ్డ మోడల్‌ మార్కెట్‌లో మూసి ఉన్న వార్డు కార్యాలయం..

నీరుగారిపోతున్న లక్ష్యం..

ప్రజలు స్థానికంగా ఎదుర్కొనే మంచినీరు, డ్రైనేజీ, రోడ్ల మరమ్మతులు, శానిటేషన్‌, వీధిదీపాలు, కలుషిత నీటి సరఫరా, దోమల బెడద, నరికిన చెట్ల కొమ్మలను రోజుల తరబడి తొలగించకపోవడం వంటి సమస్యలను వార్డు కార్యాలయాల్లో ఉండే అధికారుల దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించాల్సి ఉంటుంది. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉండాలి. కానీ ఆయా సమస్యలను విన్నవించుకుందామంటే అధికారులు అందుబాటులో ఉండడం లేదనే స్థానికులు వాపోతున్నారు. సమయం వెచ్చించి మరీ అక్కడకు వస్తే ఎవరూ లేకపోయేసరికి వెనుదిరిగి రావాల్సిన పరిస్థితి నెలకొంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవంగా ప్రతి వార్డు కార్యాలయంలో వార్డు అడ్మినిస్ట్రేటివ్‌ అధికారి, ఇంజనీర్‌, టౌన్‌ప్లానింగ్‌ అధికారి, ఎంటమాలజిస్ట్‌, శానిటరీ సూపర్‌వైజర్‌, యూబీడీ సూపర్‌వైజర్‌, జలమండలి అధికారి, విద్యుత్‌ శాఖ అధికారి, వార్డు కమ్యూనిటీ ఆర్గనైజర్‌, కంప్యూటర్‌ ఆపరేటర్‌, వీధి దీపాల విభాగం అధికారి అందుబాటులో ఉండాలి. జీహెచ్‌ఎంసీకి సంబంధించిన అధికారి అప్పుడప్పుడు వచ్చిపోతున్నారే తప్ప మిగిలిన డిపార్ట్‌మెంట్ల అధికారులైతే అసలు రానే రావడం లేదంటున్నారు.

సర్వేల పేరుతోనే కాలం వెళ్లదీత..

నిన్నమొన్నటి వరకు సమగ్ర సర్వే. ఇప్పుడేమో ఇందిరమ్మ ఇళ్ల సర్వే పేరుతో ఆయా వార్డు కార్యాలయాలకు అధికారులు రావడమే మానేసినట్లు తెలుస్తోంది. బేగంపేట డివిజన్‌లో అయితే సమస్య విన్నవించుకోవాలంటే ఎక్కడో వెస్ట్‌మారేడ్‌పల్లి ప్రాంతంలో ఉండే సర్కిల్‌ కార్యాలయానికి వెళ్లాల్సిన అగత్యం ఏర్పడింది. దీంతో అసలు వార్డు కార్యాలయాల లక్ష్యం నీరుగారిపోతోంది. స్థానికంగా అధికారులు అందుబాటులో ఉంటే సమస్యలు చెప్పుకునేందుకు అవకాశం ఉంటుందన్న ఉద్దేశ్యంతో వార్డు కార్యాలయాల వ్యవస్థను అందుబాటులోకి తీసుకువస్తే మొత్తానికే అటకక్కించే పరిస్థితులు నెలకొన్నాయా? అన్న అనుమానం కలుగుతోంది. ప్రతి సోమవారం ప్రజవాణి పేరుతో ప్రభుత్వ కార్యాలయాల్లో ఫిర్యాదులు స్వీకరిస్తున్నా..దూర భారంతో చాలామంది వెళ్లలేకపోతున్నారు. దగ్గరలో ఉన్న వార్డు కార్యాలయాలకు వెళితే..చేదు అనుభవాలే ఎదురవుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు వార్డు కార్యాలయాల వ్యవస్థను ప్రక్షాళన చేసి అధికారులు అందుబాటులో ఉండేలా చూడాలని కోరుతున్నారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్‌: ఆల్విన్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలోని పీసీబీ ఫీడర్‌ పరిధిలో మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు గ్రీన్‌ల్యాండ్స్‌ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్‌ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫతేనగర్‌ బ్రిడ్జి వెనుక వైపు, సనత్‌నగర్‌ బస్టాపు ఏరియా ప్రాంతాల్లో విద్యుత్‌ కోత ఉంటుందని పేర్కొన్నారు.

రాంగోపాల్‌పేట్‌: ఉస్మానియా యూనివర్శిటీ సబ్‌స్టేషన్ల పరిధిలోని ఫీడర్ల మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందని సీబీడీ ఏడీఈ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు లేడీస్‌ హాస్టల్‌ ఫీడర్‌ పరిధిలోని బీఎడ్‌ కాలేజ్‌, మాణికేశ్వరీనగర్‌, యాదయ్య నగర్‌, మసీద్‌, మోడల్‌ స్కూల్‌ ప్రాంతాల్లో, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వడ్డెరబస్తీ ఫీడర్‌ పరిధిలోని వడ్డెరబస్తీ, రైల్వే ట్రాక్‌ లేన్‌ ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

కూరగాయల ధరలు..

సనత్‌నగర్‌: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో..) టమాటా.15, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 50, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 28, క్యాప్సికమ్‌ 41, పచ్చకాకర 45, పందిరి బీర 45, క్యాబేజీ 13, క్యారెట్‌ 35, దొండ 45, గుండుబీన్స్‌ 45, గింజ చిక్కుడు 45, గోకరకాయ 28, కీర 35, దోసకాయ 19, బీట్‌రూట్‌ 35, ఉల్లిగడ్డ 35, ఆలుగడ్డ 25, చామగడ్డ 40, మొరంగడ్డ 28, కందగడ్డ 60, సొరకాయ 15, పొట్లకాయ 23, అరటికాయ 9, మునగకాయ 10–12, ముల్లంగి 5–6. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

పాడైపోయిన పవర్‌ బోరు.. ఎవరూ పట్టించుకోరు





లాలాపేటలోని పట్టణ ఆరోగ్య కేంద్రం, పని చేయని పవర్‌ బోర్‌

లాలాపేట: లాలాపేటలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో(తుకారంగేట్‌) పవర్‌ బోర్‌ పాడై నెల రోజుల కావస్తోంది. హాస్పిటల్‌ సిబ్బందికి, అక్కడికి వచ్చే పేషెంట్లకు వాడుక నీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై సంబంధిత హాస్పిటల్‌ ఉన్నతాధికారులకు(ఎస్పిహెచ్‌ఓ) దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లగా ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదని చేతులెత్తేసారు. దీంతో స్థానిక ప్రజాప్రతినిధులకు ఈ సమస్యను వివరించినా ఫలితం లేకపోయింది. బోరు మోటారుకు మరమతు పనులు చేయించే పరిస్థితులు ఈ ప్రభుత్వం హయాంలో లేకపోడం దారుణమని పలువురు విమర్శిస్తున్నారు.

పాఠశాల అభివృద్ధికి చర్యలు

ఎమ్మెల్యే తలసాని

పద్మారావునగర్‌: బన్సీలాల్‌పేట్‌ డివిజన్‌ బోలక్పూర్‌ క్రిష్ణానగర్‌లోని మేకలమండి ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ పేర్కొన్నారు. పాఠశాల ఆవరణలో రూ. కోటి 80లక్షల వ్యయంతో నిర్మిస్తున్న అదనపు తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి నియోజకవర్గ అభివృద్ధి నుంచి రూ. 65లక్షల మంజూరు చేసినట్లు వివరించారు. పాఠశాలను అప్‌గ్రేడ్‌ చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని డీఈఓ రోహిణిని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌ యాదవ్‌ ఆదేశించారు. బుధవారం జిల్లా విద్యా అధికారిణి రోహిణి, కార్పొరేటర్‌ కె. హేమలత, ఈఈ షఫీ, డిప్యూటీ కమీషనర్‌ సమ్మయ్య పాల్గొన్నారు.



పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



రాంగోపాల్‌పేట్‌: ఫుట్‌పాత్‌పై పడివున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గోపాలపురం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన మేరకు.. బసేరా ప్రాంతంలోని ఫుట్‌పాత్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడివుందన్న సమాచారం మేరకు పోలీసులు వెళ్లి స్వాధీనం చేసికుని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడికి 40–45 వయసుంటుందని ఒంటిపై ఎరుపు, ఆకు పచ్చ రంగు టీ షర్ట్‌, నీలం రంగు జీన్స్‌ ప్యాంటు ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

అడ్డగుట్ట: డివిజన్‌లోని లాలాగూడలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం స్థానిక కార్పొరేటర్‌ లింగాని ప్రసన్నలక్ష్మి ప్రారంభించారు. ఈ సదర్భంగా ఆమె మాట్లాడుతూ సికింద్రాబాద్‌ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌ సహకారంతో అభివృద్ధి పనులను ముమ్మరం చేసినట్లు తెలిపారు. అసంపూర్తిగా ఉన్న పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజాభివృద్ధే బీఆర్‌ఎస్‌ పార్టీ ప్రధాన లక్ష్యమని, అందులో భాగంగానే అనునిత్యం ప్రజల్లో ఉంటూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ నాయకులు లింగాని శ్రీనివాస్‌, శ్రీనివాస్‌గౌడ్‌, సత్తయ్య, వసంత, అమర్‌, నర్సింగ్‌, ఎల్లయ్య, రవి, ఇస్మాయిల్‌, ఇంతియాజ్‌, కుమార్‌, మహేందర్‌, వెంకటేష్‌ తదితరులు పాల్గొన్నారు.



లాలాగూడలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్‌ ప్రసన్నలక్ష్మి

రేపటి నుంచి వైకుంఠ ఏకాదశి వేడుకలు

రాంగోపాల్‌పేట్‌: రెజిమెంటల్‌బజార్‌లోని పాండురంగ విఠలేశ్వర స్వామి దేవాలయంలో ఈ నెల 10వ తేదీ నుంచి వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఈవో సత్యనారాయణ తెలిపారు. 10వ తేదీన వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు ఉంటాయని ఉదయం 5గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనం, ప్రత్యేక తులసి దర్శనం ఉంటుందన్నారు. 11వ తేదీ ఉదయం 12 గంటలకు అన్న ప్రసాద కార్యక్రమం ఉంటుందన్నారు. 13వ తేదీన సోమవారం ఉదయం 10గంటలకు గోదాదేవి కళ్యాణోత్సవం ఉంటుందని చెప్పారు.

సనత్‌నగర్‌లో పెరిగిన యువ ఓటర్లు

సనత్‌నగర్‌: ఎన్నికల కమిషన్‌ విడుదల చేసిన తుది జాబితా ప్రకారం సనత్‌నగర్‌ నియోజకవర్గ ఓటర్లు 2,54,356కు పెరిగారు. ఇందులో పురుషుల ఓటర్లు 1,31,446 మంది, మహిళా ఓటర్లు 1,22,898 మంది, ఇతరులు 12 మంది ఓటర్లు నమోదై ఉన్నట్లు అధికారులు విడుదల చేసిన తుది జాబితా స్పష్టం చేసింది. గత ఏడాది అక్టోబర్‌ 29న విడుదల చేసిన ముసాయిదా జాబితా ప్రకారం నియోజకవర్గంలో 2,54,165 మంది ఓటర్లుగా నమోదై ఉండగా తుది జాబితా విషయానికొచ్చేసరికి 191 మంది ఓటర్లు పెరిగారు. వీరంతా యువ ఓటర్లుగా అధికారులు పేర్కొన్నారు.

చిరువ్యాపారులను ఇబ్బంది పెట్టొద్దు



చిరు వ్యాపారుల సమస్యలను వివరిస్తున్న కాంగ్రెస్‌ పార్టీ ఎన్‌ఆర్‌ఐ యువ నేత అభిషేక్‌ అడపా

సనత్‌నగర్‌: బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్‌ బస్తీలోని చిరు వ్యాపారులను ఇబ్బందిపెట్టేలా వ్యవహరిస్తూ వారి ఉపాధిని దెబ్బ తీయవద్దని కాంగ్రెస్‌ పార్టీ ఎన్‌ఆర్‌ఐ యువ నేత అభిషేక్‌ అడపా విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన చిరువ్యాపారులతో కలిసి బేగంపేట ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ పాపయ్యను కలిసి వ్యాపారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. వారి వ్యాపారాలను తొలగించవద్దని, ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా వ్యాపారాలు చేసుకోవడానికి అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన ఇన్‌స్పెక్టర్‌ పాపయ్య తాము వ్యాపారాలను తొలగించబోమని, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూసుకోవాలని వ్యాపారులకు సూచించామని తెలిపారు. కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకులు షేక్‌గౌస్‌, శ్రీనివాస్‌రెడ్డి, రాజేందర్‌, సుమిత్‌కుమార్‌, మునీర్‌ఖాన్‌, సయ్యద్‌ అల్తామాష్‌, మనోజ్‌, రాహుల్‌ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

చిలకలగూడ : వైకుంఠ ఏకాదశి వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరుకావాలని కోరుతూ నామాలగుండు కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ ఛైర్మన్‌ నోముల ప్రకాశరావు స్థానిక ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్‌కు ఆహ్వానించారు. టకారాబస్తీలోని ఎమ్మెల్యే పద్మారావు నివాసంలో బుధవారం కలిసి ఆహ్వాన పత్రికను అందించి ఉత్తరద్వారం నుంచి స్వామివారిని దర్శించుకోవాలని కోరారు.

డబుల్‌ బెడ్రూమ్‌ ఇళ్లు నిర్మించాలి

అడ్డగుట్ట: తుకారాంగేట్‌లో పురాతనమైన ఎంసీహెచ్‌ క్వార్టర్స్‌ను తొలగించి వాటి స్థానంలో డబుల్‌ బెడ్రూమ్‌లు నిర్మించాలని తుకారాంగేట్‌ బీజేపీ నేత నర్సింగ్‌రావు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు బుధవారం ఆయనకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం తుకారాంగేట్‌లో మాట్లాడుతూ... 55 సంవత్సరాల క్రితం నిర్మించిన ఎంసీహెచ్‌ క్వార్టర్స్‌ శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. అందులో నివాసముంటున్న వారు భయాందోళనల నడుమ జీవనం సాగిస్తున్నారన్నారు. అందువల్ల వాటి స్థానంలో డబుల్‌ బెడ్రూమ్‌లు నిర్మించాలని కోరుతూ సీఎం క్యాంపు ఆఫీసులోని ప్రజావాణిలో కూడా వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు.



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న నర్సింగ్‌రావు

అప్పులబాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య



వీరనారాయణ (మృతుడు)

సికింద్రాబాద్‌: అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సికింద్రాబాద్‌ జీఆర్పీ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. ఆర్‌కేపురానికి చెందిన మద్దు వీరనారాయణ(45) కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో అప్పుల పాలయ్యాడు. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన వీరనారాయణ బుధవారం సాయంత్రం 4 గంటల సమయంలో ఆర్‌కే పురం – సఫీల్‌గూడ రైల్వే స్టేషన్ల మార్గం మధ్యలోని పట్టాలపై రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.

ఓయూ సివిల్‌ సర్వీస్‌ అకాడమీలో తరగతులు ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌ సివిల్‌ సర్వీసెస్‌ అకాడమిలో తరగతులు ప్రారంభమయ్యాయి. బుధవారం అకాడమి తరగతి గదిలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి డైరెక్టర్‌ ప్రొ.కొండ నాగేశ్వర్‌ అధ్యక్షత వహించగా ఓయూ వీసీ ప్రొ.కుమార్‌, సామాజిక వేత్త బాలలత ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు కష్టపడి చదవి సివిల్‌ సర్వీస్‌ ఉద్యోగాలు సాధించాలని కార్యక్రమంలో ప్రొ.గణేష్‌, కోఆర్డినేటర్‌ విజయ్‌కుమార్‌, రఫిక్‌, శ్రీనివాస్‌, శోభ తదితరులు పాల్గొన్నారు.

గోదా కల్యాణోత్సవానికి రండి



ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆలయ నిర్వాహకులు

అడ్డగుట్ట: మోండా మార్కెట్‌ డివిజన్‌లోని శ్రీ పాండు రంగ విఠలేశ్వర వెంకటాద్రి స్వామి దేవాలయంలో జరుగుతున్న గోదా కళ్యాణ మహోత్సవానికి కంటోన్మెంట్‌ ఎమ్మెల్యే శ్రీ గణేష్‌ను ఆహ్వానించారు. బుధవారం మోండా డివిజన్‌కు చెందిన కాంగ్రెస్‌ నాయకులు, పాండురంగ విఠలేశ్వర వెంకటాద్రి స్వామి దేవాలయ నిర్వాహకులు తుకారాంగేట్‌లో ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను కలిశారు. డిసెంబర్‌ 16వ తేదీన ప్రారంభమైన గోదా కళ్యాణ మహోత్సవ కార్యక్రమాలు జనవరి 13వ తేదీ వరకు జరుగుతాయన్నారు. అనంతరం, ఎమ్మెల్యే శ్రీ గణేష్‌ చేతుల మీదుగా నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు.

ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు



ఉత్తరద్వార దర్శనం కోసం ఏర్పాటు చేసిన ఏడు ద్వారాలు

చిలకలగూడ : ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని చిలకలగూడలోని పలు ఆలయాల వద్ద ఆధ్యాత్మికశోభ నెలకొంది. పుష్పాలు, విద్యుత్‌ దీపాలతో ముస్తాబు చేసిన ఉత్తర ద్వార దర్శనానికి తగిన ఏర్పాట్లు చేపట్టారు. నామాలగుండు కళ్యాణ వేంకటేశ్వర స్వామి, శ్రీనివాసనగర్‌ శ్రీగిరి ప్రసన్న వెంకన్నస్వామి, చిలకలగూడ సాయిబాబా సమేత బాలాంజనేయస్వామి ఆలయాల్లో ఈనెల 10న ముక్కోటి ఏకాదశి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ పరిసర ప్రాంతాలను విద్యుత్‌ దీపాలు, భారీ సెట్టింగులను ఏర్పాటు చేశారు.

బీజేపీ ఎంపీ రమేష్‌బిదూరీ దిష్టిబొమ్మ దహనం

చిలకలగూడ : సీతాఫల్‌మండి చౌరస్తాలో పలువురు కాంగ్రెస్‌ నాయకులు బుధవారం ఢిల్లీ బీజేపీ ఎంపీ రమేష్‌బిదూరీ దిష్టిబొమ్మను దహనం చేశారు. సికింద్రాబాద్‌ డీసీసీ అధ్యక్షుడు అనిల్‌కుమార్‌యాదవ్‌ ఆదేశాల మేరకు సికింద్రాబాద్‌ ఏ, బీ బ్లాక్‌ ప్రెసిడెంట్లు జగదీశ్వరరావు, సురేష్‌లాల్‌ నేతృత్వంలో ధర్నా, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు బీజేపీ ఎంపీ రమేష్‌ బిదూరీ కాంగ్రెస్‌ అగ్రనేత, పార్లమెంట్‌ సభ్యురాలు ప్రియాంకగాంధీని కించపరిచేలా మాట్లాడడం బీజేపీ నీచసంస్కృతికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకులు జగదీశ్వరరావు, సురేష్‌లాల్‌, యాదగిరి, జహంగీర్‌, రాజేశ్వర్‌ పాల్గొన్నారు.

